ప్రజాశక్తి
శనివారం 23 నవంబరు 2024
5
శ్రీకాకుళం



నేడు నౌపడ రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం వద్ద నౌపడ రైల్వే గేటును శనివారం 12 గంటల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు, పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్ అత్యవసర మరమ్మతుల పనుల కారణంగా ట్రాఫిక్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నౌపడ-టెక్కలి రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి, సహకరించాలని కోరారు.

సమస్యలు సమసేనా..?

- నేటికీ ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు
- అపరిష్కృతంగా షట్టర్ల సమస్య
- మారని రోడ్ల దుస్థితి
- ఆగని ఇసుక అక్రమ రవాణా
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి నూతన సమావేశం మందిరంలో శనివారం నిర్వహించనున్నారు. జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. నవంబరు నాలుగో వారంలోకి ప్రవేశిస్తున్నా, నేటికీ ధాన్యం కొనుగోలు జరగడం లేదు. అల్పపీడనం ప్రభావంతో ఈనెల 26, 27 తేదీల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, వంశధార షట్టర సమస్య పరిష్కారం కావడం లేదు. సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. వంశధార పనులు ముందుకు సాగడం లేదు. ఆఫ్‌షోర్ పనులు నిలిచిపోయాయి. జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందిస్తామని చెప్తున్నా, పనులు మాత్రం చాలా ఆలస్యంగా జరుగుతున్నాయి. మరోవైపు ఆర్ అండ్ బి రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీటిలో ఎన్ని అంశాలు చర్చిస్తారు, వేటికి పరిష్కారం చూపుతారన్నది చూడాల్సి ఉంది.

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఐదు లక్షల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్నీ లెక్క కట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ధాన్యం కొనుగోలుపై ఈనెల మొదటి వారంలో సమీక్ష నిర్వహించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు 17వ తేదీ నుంచి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. ధాన్యం కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ (బిజి)లు సమర్పణలో కొంత జాప్యం చేసుకోవడంతో, జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కోసం 402 కేంద్రాలను గుర్తించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 268 మిల్లులకు సిఆర్‌ఎం (కస్టమ్స్ రైస్ మిల్లింగ్)కు ఇవ్వాలని నిర్ణయించారు.

268 మిల్లులకు సంబంధించి సగం మంది కూడా ఇప్పటివరకు బిజిలు సమర్పించలేదని తెలిసింది. ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను 1207 మంది సిబ్బందిని అవసరమని గుర్తించారు. వారిలో ఇంకా 70 మందిని నియమించాల్సి ఉంది. అల్పపీడన ప్రభావంతో ఈ నెల 26,27 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్తున్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది.

షట్టర్ల సమస్యకు పరిష్కారం దొరికేనా?

వంశధార కాలువలపై ఏర్పాటు చేసిన సాగునీటి కాలువలు ఎక్కడికక్కడ శిథిలమయ్యాయి. నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లపై అవినీతి కేసు 15 ఏళ్ల గడుస్తున్నా కేసు తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.ఐదు కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



మత్స్యకారులకు అందని వేట నిషేధ పరిహారం

సముద్రంలో చేపల వేటపై ఉన్న నిషేధం ఎత్తేసి రెండున్నర నెలలు కావస్తోంది. మత్స్యకారులకు అందాల్సిన పరిహారం నేటికీ వారి ఖాతాల్లో జమ కాలేదు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్ 15వ తేదీన చేపల వేటపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. పరిహారం చెల్లింపుల కోసం ఈ ఏడాది జూన్ రెండో తేదీన జాబితాను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. డబ్బుల కోసం వేలాది మంది మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

అధ్వానంగా రహదారుల పరిస్థితి

జిల్లాలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి పనులను 2018లో రూ.40 కోట్లతో పనులు ప్రారంభించారు. 2021 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.15 కోట్లు వరకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఆగిపోయాయి. బకాయి బిల్లులపై వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీతో తిరిగి పనులు మొదలయ్యాయి. వీటితో పాటు బత్తిలి-అలికాం, కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం, చిలకపాలెం - రాజాం వంటి ప్రధాన రహదారులు బాగా శిథిలమయ్యాయి.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొత్తూరు మండలం నివగాం, అంగూరు, ఆకులతంపరలో నిబంధనలకు విరుద్ధంగా నదిలోకి ప్రొక్లెయిన్లను దించి పగలు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రివేళల్లో లారీల్లో తీసుకువెళ్తున్నారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ఓపెన్ రీచ్‌లో రాత్రీ పగలు తేడా లేకుండా ప్రొక్లెయిన్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఆమదాలవలస మండలం దూసిలో ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వకపోయినా ఇసుక తవ్వేసి ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, బకాయి వేతనాలు చెల్లించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ ఆధ్వర్యాన వాలంటీర్లు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల విధి విధానాలు ప్రకటించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక అనేకమంది డిగ్రీ పూర్తి చేసిన యువకులు రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లుగా పనిచేస్తున్నారని, ప్రస్తుత ప్రభుత్వం వారిని రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు వేతనాలు పెంచకుండా పెంచుతామనే భ్రమలు కల్పించి వెట్టిచాకిరీ చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు వైసిపి నాయకులు వాలంటీర్లపై తీవ్ర ఒత్తిడి చేసి బలవంతంగా రాజీనామాలు చేయించారని తెలిపారు. మెజారిటీ వాలంటీర్లు భయంతో రాజకీయ ఒత్తిళ్లను భరించలేక రాజీనామా చేశారని చెప్పారు. అతి తక్కువ ఆదాయంతోనే వాలంటీర్లు కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈధర్నాలో వాలంటీర్లు ఎ.రాంబాబు, ఎన్.భాస్కరరావు, అప్పలమ్మ, సవర.సుజాత, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

24న ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రస్థాయి మెన్ అండ్ ఉమెన్ సీనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారుల ఎంపికను నగరంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జిల్లా ఆర్చరీ అసోషియేషన్, చెరుకూరి ఓల్గా అసోషియేషన్ సంయుక్తంగా విజయవాడలో డిసెంబరు మూడు నుంచి ఐదో తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఎంట్రీ ఫీజుతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440677201, 9989978727 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతులు రెండో పంట వేయొద్దు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వంశధార నదీ పరివాహక ప్రాంత రైతులంతా రెండో పంట సాగు చేయొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంశధార నది ఎగువ ప్రాంతంలో, ఎగువ పరివాహక ప్రాంతంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. వంశధార గొట్టాబ్యారేజీలో 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, తాజా పరిణామాల నేపథ్యంలో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. వంశధార నదిలో జిల్లా శివారు ప్రాంతాలకు రెండో పంటకు అవసరమైన సాగునీటి నిల్వలు సరిపడినంతగా లేవని, ఈ విషయాన్ని రైతాంగం గుర్తించాలని కోరారు. నీటిఎద్దడి ఈ నేపథ్యంలో రైతులు రెండో పంట వేయొద్దని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయ విద్యార్థినికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - మెళియాపుట్టి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విశాఖపట్నంలో గ్యాంగ్ రేప్‌నకు గురైన న్యాయ విద్యార్థినికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చాపరలో శుక్రవారం ధర్నా నిర్వహించి, ప్రధాన రహదారిపై మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇటువంటి వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా మహిళలను నేరాలను నివారించడంలో విఫలమైందన్నారు. ఈ ఐదు నెలల కాలంలో ఒక్క కేసు కూడా విచారణ సవ్యంగా సాగలేదని, నిందితులకు శిక్షలు పడలేదని చెప్పారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరిట స్త్రీలను అణచివేస్తున్నారని చెప్పారు. వరుస అత్యాచార ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, పోలాకి ప్రసాదరావు, శంకర్, మన్మథరావు, మీనా, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- సత్వర పరిష్కారం చూపాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- కంచిలి తహశీల్దార్, విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - పలాస

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు పలు సమస్యలపై వినతులకు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఒక కళ్యాణ మండపంలో పలాస డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కంచిలి మండలానికి చెందిన మల్లారెడ్డి మోహనరావు సిఎం గ్రీవెన్స్‌కు ఇచ్చిన వినతి పరిష్కారం విషయంలో కంచిలి తహశీల్దార్ రమేష్, చిన్న కొజ్జిరియా విఆర్ఒ హర్షవర్ధన్ పొంతన లేని సమాధానాలు చెప్పడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సిఎం గ్రీవెన్స్‌కు వచ్చిన సమస్యను పరిష్కరించకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులపై తహశీల్దార్ లాగిన్ ఎవరికి ఇస్తే వారు పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వాలన్నారు. లాగిన్‌లో కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుడు సమాచారం పెడితే, అందుకు తహశీల్దార్లే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కంచిలి తహశీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులను కొందరు తహశీల్దార్లు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల్లో ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం'లో వచ్చిన వినతులకు అక్కడే పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలాల్లో పరిష్కారమయ్యే సమస్యలకూ వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రంలోని 'మీకోసం'కు ప్రజలు వస్తున్నారని చెప్పారు. సిఎం, డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రి పేషీల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. నీటి పన్ను వసూళ్లు చాలా మండలాలలో ఇంతవరకు ప్రారంభించలేదని చప్పారు. మూడు వారాల్లో నీటి పన్ను వసూళ్లుపూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని కార్యాలయాలకు భవనాలు లేవని, ఉన్న భవనాలు సరిపోవడం లేదని చెప్పారు. నూతన భవనాల కోసం అవసరమైన ప్రతిపాదనలు అందజేస్తే, అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ జి.వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు పరిశీలన

మండలంలోని రాజగోపాలపురంలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సిసి రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. పనులకు సంబంధించిన రికార్డులు తీసుకురాకపోవడంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించగా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మౌనం దాల్చడంతో ఎలా పరిశీలించాలో చెప్పలేదా ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డిఒ జి.వెంకటేష్, పంచాయతీరాజ్ డిఇ రవిబాబు, ఇఇ సత్యప్రకాష్, క్వాలిటీ డిఇ ప్రదీప్, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంత కుమార్ తదితరులున్నారు.



సమావేశమైన పోర్టు ప్రతిపాదిత ప్రాంత ప్రజలు

ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వం

- పొట్ట కొట్టే పనిచేయొద్దు
- స్పష్టం చేసిన పోర్టు ప్రతిపాదిత ప్రాంత ప్రజలు

ప్రజాశక్తి - మందస

భూములే జీవనాధారంగా బతుకుతున్నామని, ఎయిర్‌పోర్టు కోసం వాటిని ఇచ్చే ప్రసక్తే లేదని మండలంలోని రాంపురం, భేతాళపురం, బిడిమి పంచాయతీల ప్రజలు స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా మండలంలోని రాంపురంలో పోర్టు ప్రతిపాదిత గ్రామాల ప్రజలు శుక్రవారం సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టు వద్దే వద్దని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎయిర్‌పోర్టు పేరిట భూములు లాక్కొని తమ పొట్ట కొట్టొద్దన్నారు. బిడిమి, భేతాళపురం, రాంపురం పంచాయతీల పరిధిలో సుమారు 1100 ఎకరాల జిరాయితీ భూములను పోర్టు కోసం అధికారులు గుర్తించారని చెప్పారు. ఉద్దాన ప్రాంతంలో జీవనాధారమైన కొబ్బరి, జీడి మామిడి తోటలను నాశనం చేసి నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు తమకు అవసరం లేదన్నారు. అభివృద్ధి పేరు చెప్పి తమకు అడ్రస్ లేకుండా చేసే ప్రయత్నాలను ప్రతిఘటిస్తామన్నారు. తిత్లీ తుపాను విధ్వంసం తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని, ఈ దశలో పూర్తిగా భూములే లేకుండా చేసి తమకు బతుకు లేకుండా చేయడం తగదన్నారు. భూములను ఎయిర్‌పోర్టు కోసం ఇచ్చే ప్రస్తే లేదని, భూములను కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామన్నారు. భూసేకరణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని మండల, డివిజనల్, జిల్లాస్థాయి అధికారుల వరకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు తెప్పల ఢిల్లేశ్వరరావు, దున్న రామారావు, తామాడ తుమ్మనాథం, మర్ల సంతోష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య కార్డులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్



కిమ్స్ అధినేత భాస్కరరావును సత్కరిస్తున్న ఎస్‌పి

పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా జిల్లాలో హోంగార్డు నుంచి పోలీసు అధికారి వరకు అందరికీ ఉచిత ఆరోగ్యకార్డులు జారీ చేయనట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సౌజన్యంతో పోలీసు అధికారులు, సిబ్బందికి రాగోలులోని జెమ్స్, శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రుల్లో ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రిలో ఆరోగ్య రక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్‌పి, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిఎమ్‌డి బొల్లినేని భాస్కరరావు ప్రారంభించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసులు రూ.వంద కడితే ఎటువంటి అదనపు నగదు చెల్లింపుల్లేకుండా ఉచిత ఆరోగ్య కార్డు ద్వారా అన్నిరకాల వైద్య పరీక్షలు, సేవలు పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు సర్వీస్ కాలం మొత్తం ఉచితంగా అందిస్తామని బొల్లినేని భాస్కరరావు చెప్పడంపై ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న పోలీసు సిబ్బంది అందరూ చెల్లించాల్సిన మొత్తాన్ని పోలీస్ వెల్ఫేర్ ఫండ్ కింద చెల్లిస్తానన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలందించగలరని చెప్పారు.

కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిఎమ్‌డి బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడిందన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించక అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. పోలీసు సిబ్బంది భవిష్యత్‌లోనూ ఎటువంటి రుసుము లేకుండా ఉచిత వైద్య పరీక్షలు, సేవలందిస్తామని భరోసానిచ్చారు. పని ఒత్తిడి తగ్గించుకొని కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని 200 మంది పోలీస్ సిబ్బందికి ఒకే దశలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహణకు ముందుకొచ్చిన బొల్లినేని భాస్కరరావును ఎస్‌పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో

75 శాతం పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్దానంలోని కిడ్నీ రిసెర్చ్ సెంటర్‌లో 75 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, కొలికపూడి శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేటాయించిన 61 స్పెషలిస్టు పోస్టుల్లో 17 మంది మాత్రమే ఉన్నారని, కీలకమైన నెఫ్రాలజీ, యూరాలజీ, అనస్తీషియా, కార్డియాలజీ, రేడియాలజీ విభాగాల్లో 41 ఖాళీలున్నాయని వివరించారు. ఈ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిలో భాగంగానే ఇక్కడ స్పెషలిస్టు పోస్టుల్లో పనిచేయడానికి వచ్చే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో వ్యాధి కారణాలపై అధ్యయనం చేసేందుకు అమెరికాకు చెందిన హార్వర్డ్ యూనివర్సిటీతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. తిరువూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నీటిలో ఫ్లోరైడ్ సిలికాన్ ఎక్కువగా ఉండటంతో కిడ్నీ సమస్యలు వస్తున్నాయని, పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధికి డయాలసిస్ చేయించుకునే వారితో పాటు మందులు వాడే వారికి నెలకు రూ.5 వేలు పింఛను అందించడానికి ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

డిసెంబరు 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సివిల్ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి ఇదో మార్గమన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణము సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
వివిధ కారణాలతో కారాగారంలో ఉండే ముద్దాయిలు సత్ప్రవర్తనతో తిరిగి రావాలని, సమాజంలో గౌరవ ప్రదంగా జీవనం సాగించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం గార మండలం అంపోలు వద్ద ఉన్న జిల్లా జైలును ఆయన సందర్శించారు. ఖైదీలకు న్యాయ సలహాలు, సూచనలు అందించడంతో పాటు న్యాయపరమైన సేవ అందించడానికి జైలు యాజమాన్యం న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లను నియమించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, జైలు అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

ప్రసవాల సంఖ్య పెరగాలి

ప్రజాశక్తి- పలాస
ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని జిల్లా అదనపు వైద్యాధికారిణి వెంకట లక్ష్మి ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ అర్బన్ వైద్యాధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను పిస్తుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెల ప్రసవాల సంఖ్య ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా అవగాహన చేయాలన్నారు. లక్ష్యాలు పూర్తిచేయని ఆశాలను వేరే ప్రాంతాలకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిపిఒ మురళీ, డి.పి.ఎస్.ఎస్.యు తెలజ, వైద్యులు బి.దివాకర్ ఆశా, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


డిఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబూరావు

డిఎస్‌పిని కలిసిన 'వజ్జ'

ప్రజాశక్తి- పలాస
కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం డిఎస్‌పి వి. వెంకట అప్పారావును ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకర్, జగదీష్ పండా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

'పినకాన' ఆశయాలు కొనసాగిద్దాం

నందిగాం: ప్రజాపక్షపాతి సిపిఎం నాయకులు పినకాన కృష్ణమూర్తి ఆశయాలను మనమంతా కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కోనారి మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం వద్ద కృష్ణమూర్తి స్మారకంలో 8వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా నరసింగపల్లి వద్ద గల స్తూపానికి నివాళులర్పించారు. రైతాంగ పోరాటం ద్వారా రైతుల సమస్యలపై పోరాడేందుకు సన్నద్ధం చేసిన మహోన్నత వ్యక్తి కృష్ణమూర్తి అని కొనియాడారు. అనునిత్యం ప్రజల కోసం పోరాడే వ్యక్తి, రైతులకు సాగునీరు అవసరాన్ని గుర్తించి కాట్రగడ వద్ద బేడారి వంటి రిజర్వాయర్ నిర్మించాలని పోరాటం నిర్వహించిన వ్యక్తిని కొనియాడారు. ఆఫ్‌షోర్ నిర్మాణంలో కృష్ణమూర్తి పోరాట పాత్ర ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాలిన సాంబమూర్తి, అజయ్ కుమార్, కె.ధర్మారావు తదితరులున్నారు.


పుస్తకాలను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

జగ్గన్న ట్రస్ట్ సేవలు భేష్

కవిటి: విశాఖపట్నం ఎంవిపి కాలనీకి చెందిన శ్రీ జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్టు గత పదేళ్లుగా విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు శ్లాఘనీయమని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బెందాలం మల్లేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్రస్ట్ సభ్యులు శుక్రవారం మోడల్ పేపర్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ జుత్తు సింహాచలం మాట్లాడుతూ జగ్గన్న మెమోరియల్ ట్రస్టు ద్వారా జిల్లాలో 20 మండలాల్లోని ఉన్నత పాఠశాలలకు రూ.7 లక్షల విలువ చేసే 2800 సెట్ల పుస్తకాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌బిఐ మేనేజర్ బెందాలం యోగానందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తీర్పును పున:సమీక్షించాలి

పలాస : దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని తీర్పునివ్వడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని, సుప్రీంకోర్టు తీర్పును పున:సమీక్షించాలని ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బోకర్ నారాయణరావు డిమాండ్ చేశారు. పలాస రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద డిసెంబర్ 8న నిర్వహించు చలో విశాఖ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, పెరిగిన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా దళితులు, ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణరావు, మట్ట రామకృష్ణ, తెంబూరు గిరిధర్, యూనియన్ సెక్రటరీ రామకృష్ణ గొజ్జ దేవరాజు, బోనల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మైదానంలో అక్రమ నిర్మాణం

- మంత్రి పేరుతో బుకాయింపు
- అడ్డుకున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి- టెక్కలి
టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని కొంత భాగంలో అక్రమంగా క్రికెట్ పిచ్ నిర్మాణం రాత్రికి రాత్రే జరగడంపై పలువురు విద్యార్థులు, వాకర్స్, ఇతర క్రీడాకారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రభుత్వ కళాశాల మైదానంలోని కొంత భాగంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న ప్రయివేట్ వ్యక్తుల్ని ప్రశ్నిస్తే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తాలుకా మనుషులమని చెప్పడంతో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి భయపడుతున్నారు. స్థానికంగా క్రికెట్ సామాగ్రీ అమ్ముకుంటున్న ఒక దుఖానానికి చెందిన వ్యక్తులే ఈ


అక్రమంగా నిర్మించిన పిచ్

నిర్మాణానికి శ్రీకారం చుట్టడం గమనార్హం. ప్రస్తుతం డిగ్రీ కళాశాల మైదానంలో ఇప్పటికే రెండు క్రికెట్ పిచ్‌లను అధికారికంగా నిర్మాణం చేపట్టారు. వాటిని కొందరు ఉచితంగానే వినియోగిస్తున్నారు. అయితే కొత్తగా కళాశాల మైదానంలో మధ్య భాగంలో ఈ నిర్మాణం జరగడంతో చాలా మంది అవాక్కయ్యారు. మొదట్లో కళాశాల మైదానాన్ని చదునుచేసేందుకు యంత్రాల్ని వినియోగిస్తున్నారని భావించారు. అయితే రెండు రోజుల వ్యవధిలోనే పక్కాగా కాంక్రీట్‌తో పిచ్ నిర్మాణం అక్రమంగా ప్రయివేట్ వ్యక్తులు చేపడుతుండడంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ దృష్టిలోకి గురువారం కొందరు తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె అక్రమ నిర్మాణదారుల్ని ప్రశ్నించి అడ్డుకున్నారు. అయితే తాము చేపడుతున్న పిచ్ నిర్మాణం తాత్కాలికమేనని కళాశాల యాజమాన్యం ఎప్పుడు తొలగించమంటే అప్పుడే తొలగిస్తామని నిర్మాణదారులు ప్రిన్సిపాల్ వద్ద చెప్పినట్లు సమాచారం. అయితే పక్కా నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టంగా ప్రిన్సిపాల్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అక్రమ నిర్మాణదారులు మాత్రం గురువారం రాత్రి నాటికి సిమెంట్, ఇసుక, కాంక్రీట్ యంత్రం, వాటర్ ట్యాంక్ వంటివి


రాత్రికి రాత్రే తరలిన సామగ్రి

స్థలంలో విడిచిపెట్టి నిర్మాణానికి సిద్ధపడడం విశేషం. దీంతో కొందరు ప్రశ్నిస్తు జిల్లా క్రీడాశాఖాధికారి దృష్టిలోకి సమస్య తీసుకువెళ్లడంతో ఆయన అదేశాల మేరకు పనులు నిలిచిపోయాయి. కళాశాల మైదానం మధ్య భాగంలో చేపట్టిన ఈ నిర్మాణం వలన వాకర్స్‌కి, సమీపంలో ఉన్న భాస్కెట్‌బాల్ మైదానానికి ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. కాగా ప్రభుత్వ మైదానంలో యథేచ్ఛగా ప్రయివేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణం జరపడంతో కళాశాల మైదానానికి రక్షణ లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉండగా అక్రమంగా నిర్మాణం చేపడుతున్న ప్రయివేట్ వ్యక్తులకు మంత్రి అచ్చెన్నాయుడు అండదండలున్నాయని చెప్పడం, నిర్మాణాన్ని అడ్డుకున్న వారికి పట్టణంలోని టిడిపికి చెందిన ఒక నాయకుడు ఫోన్ చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న వారు మన వారేనని చూసిచూడనట్లు వెళ్లిపోవాలని కోరినట్లు సమాచారం. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మ వద్ద ప్రస్తావించగా కళాశాల మైదానంలో జరుగుతున్న ఆక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నామని, రాత్రికి రాత్రే బిల్డింగ్ మెటీరియల్ వేయడం చూశామని తీయమని చెబుతామన్నారు. ఇదే విషయమై జిల్లా క్రీడాశాఖాధికారి శ్రీధర్‌ని అడుగ్గా తన దృష్టికి వచ్చిందని అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లి నిర్మాణాన్ని నిలిపివేయమని చెప్పినట్లు తెలిపారు. ఇంకా నిర్మాణం చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని క్రీడాశాఖాధికారి తెలిపారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- మెళియాపుట్టి
కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పిలుపునిచ్చారు. చాపర సిఐటియు కార్యాలయంలో ధర్నా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాల్లో మార్పులేదన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఇదే విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. గత పదేళ్లలో బిజెపి కార్పొరేట్లకు 19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందన్నారు. కార్మికులకు నెలకు ఇవ్వాల్సిన రూ.26 వేలు కనీస వేతనాన్ని ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన స్కీమ్ కార్మికులను కార్మికులుగా గుర్తించడం లేదని, కార్మికులు ఎంత కాలం పనిచేసినా పర్మినెంట్ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీసభ్యులు పోలాకి ప్రసాదరావు, బూరి లక్ష్మమ్మ, ఎస్. సిరిమమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న చేపట్టనున్న కార్మిక, రైతుల సంఘాల కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, సిఐటియు ఆఫీస్ బేరర్ బి.మురళి పిలుపునిచ్చారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో కలెక్టరేట్ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఎం. సూర్యనారాయణ, ఆర్.చిన్నారావు, కె.రవి, బి.శ్రీను, రాజేంద్ర, అన్నాజీరావు, రాజు, టి. కుమారి, జి.సుశీల, ఎన్.దమయంతి, ఆర్.రోజా తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా శిరీష


శిరీష

పలాస: పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా ఎమ్మెల్యే గౌతు శిరీషకు ప్రభుత్వం స్థానం కల్పించింది. ఈమేరకు అసెంబ్లీలో శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అందించిన అదనపు విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని చెప్పారు. ప్రభుత్వానికి వనరులు అందించేందుకు తనవంతుగా సహాయకారిగా ఉంటానని స్పష్టం చేశారు.


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది

ఆయుష్‌తో మధుమేహ నియంత్రణ

ప్రజాశక్తి- పొందూరు
మధుమేహ నియంత్రణలో ఆయుష్ మందులు ఎంతగానో దోహదపడతాయని వైద్యాధికారులు డా.జి.రమేష్‌నాయుడు, డా.నవీన్‌పవన్ కళ్యాణంలు అన్నారు. మండలం తాడివలస పిహెచ్‌సిలో జాతీయ ఆయుష్‌మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు ఆయుష్ వైద్యసేవలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్ వైద్యం వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడుతుందని, ఈ వైద్యవిధానంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. మధుమేహ నియంత్రణకు ఈ వైద్యవిధానంలో మంచి మందులు ఉన్నాయన్నారు. అనంతరం యోగా ఆసనాలు ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో కింతలి హోమియో వైద్యాధికారి డా.పి.పద్మజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


కంచిలి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- కంచిలి
ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కంచిలి మండల యుటిఎఫ్ శాఖ ప్రతినిధులు కోరారు. మందస మండలం హరిపురంలో 24, 25 తేదీల్లో జరిగే మహాసభల పోస్టర్‌ను ఎంఇఒలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, కోశాధికారి త్రినాథ్, గౌరవ అధ్యక్షులు త్రిలోచన ప్రధాన్, జిల్లా కౌన్సిలర్లు పురుషోత్తం రెడ్డి, హేమసుందర్, ఆడిట్ కమిటి కన్వీనర్ భగవతీరావు, త్రినాథ్ సాహు, కృష్ణ చంద్ర బెహరా, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నరసన్నపేట : ఈనెల 24, 25 తేదీల్లో మందస మండలం హరిపురంలో జరగనున్న స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ మూర్తి కోరారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఉప్పాడ శాంతారావు, దాలినాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.దమమయంతి, నరసన్నపేట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సుధీర్ కుమార్, కె.ఆదినారాయణ, ఆర్. బాబురావు, మన్మధరావు పాల్గొన్నారు

పార్టీని బలోపేతం చేద్దాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస
వైసిపి నాయకులు, కార్యకర్తలందరం కలిసి సంఘటితంగా పార్టీని బలోపేతం చేద్దామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్ద మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11న మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి తనను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిదే కీలకపాత్రని అటువంటి ప్రతిపక్ష పార్టీని అధికార టిడిపి అణచివేయాలని చూస్తుందని అందరం సంఘటితంగా పోరాటం చేసి ప్రజల పక్షాన పోరాడుదామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుందన్నారు. అలవికాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేక శతమతమవుతుందని వాటిని కప్పిపుచ్చుకునేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజల దృష్టిని పక్కతోవ పట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగరేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, సురవరపు నాగేశ్వరరావు, కొంచాడ రమణ, లోలుగు కాంతారావు, నాలుగు మండలాలకు చెందిన ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ప్రతి బ్యాంకు పరిధిలో ఉన్న లబ్దిదారులు ఆర్థిక అంశాలు, వివిధ రకాల రుణాలు, బ్యాంకు లావాదేవీల్లో జరుగుతున్న మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, బ్రాంచ్ మేనేజర్, కన్వీనర్ లిసాంత్ మిశ్రా అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లుతో సమావేశం నిర్వహించారు. రెండవ క్వార్టరు జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ ఇచ్ఛాపురం. కవిటి మండలాల లైన్ డిపార్ట్మెంట్స్, ఎపిఎం, సెర్ప్, మెప్మా, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిఎఫ్ఎల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బ్యాంకు పరిధిలో ఉన్న లబ్దిదారులు ఆర్థికపరమైన అంశాలు, వివిధ రకాల రుణాలు, వివిధ రకాల భీమా పథకాలు, బ్యాంకు లావాదేవీలలో జరుగుతున్న వివిధ రకాల మోసాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. బ్యాంకింగ్ ఆర్థిక సేవల్లో జరిగే మోసాలకు మోసపోయిన లబ్దిదారులు మూడు రోజుల్లో కంప్లైంట్ రిజిస్టర్ చేయాలని, పదివేల కంటే ఎక్కువ మోసం జరిగినప్పుడు పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీతో పాటు కంప్లైంట్ అందించాలని తద్వారా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ప్రసాదరావు, ఎఒ భార్గవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్‌డిఎం సూర్యకిరణ్

పశుగ్రాస సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- పోలాకి
పశుసంవర్ధక శాఖ, జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాసాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రియాగ్రహారం పశువైద్యాధికారి డాక్టర్ చింతాడ షణ్ముకరావు తెలిపారు. శుక్రవారం పశువైద్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాన్వర్జెన్సీ పద్ధతిలో పశుగ్రాసల సాగుకు ఏడాది పాటు ఖర్చులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సాగుకు పది సెంట్లుకు రూ.6599, 20 సెంట్లుకు రూ.13197, 30 సెంట్లుకు రూ.19795, 40 సెంట్లుకు రూ.26394, 50 సెంట్లుకు రూ.32992 ప్రభుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. అర్హత గల పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆమదాలవలస : పశు గ్రాసాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్య కేంద్రంలో మాట్లాడారు. సంవత్సరం పాటు పశుగ్రాసాల సాగుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందజేస్తుందని, ప్రభుత్వం అందజేస్తున్న ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


షణ్ముఖరావు


వినతిపత్రం అందజేస్తున్న కన్సల్టింగ్ కమిటీ సభ్యులు

రిజర్వేషన్ సమయాన్ని పెంచాలి

కంచిలి: కంచిలి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సదుపాయాన్ని రెండుపూటలా జరిగేలా పునరుద్ధరించాలని స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు పూనా రవికుమార్, ఎస్.తిరుపతిరావు, నాగేంద్ర, పురుషోత్తం యాదవ్, టిల్లు శర్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిఎంఐ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌ను ఒక్క పూటకే పరిమితం చేయడం వలన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని రెండు పూటలా రిజర్వేషన్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఖుర్దా డివిజన్ ఉన్నతాధికారులతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదు

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో 9వ వార్డు ఇన్‌ఛార్జి శాసనపురి మోహనరావుతో కలిసి టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. వార్డు ఇన్‌ఛార్జులు చిలకమ్మ, చంద్రశేఖర్ త్యాడి, ఇన్‌ఛార్జి వంకల జానకిరావు, కొట్ట సత్యం, అజయ్ నాయక్, టిడిపి నాయకులు ప్రధాన్, రమేష్, హరి, రాజేష్, దేవ్ పాల్గొన్నారు. అదే విధంగా వెంకటేశ్వర కాలనీలో సభ్యత్వ నమోదు నిర్వహించారు.

ఎఇఒగా బెందాళం కళ్యాణ్


కళ్యాణ్

ప్రజాశక్తి- కవిటి
మండల ఎఇఒగా బెందాళం కళ్యాణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2019 నుంచి కవిటి -2 సచివాలయ వ్యవసాయ సహాయకుడిగా పనిచేస్తున్న కళ్యాణ్ పదోన్నతిపై మండల ఉప వ్యవసాయ అధికారిగా (ఎఇఒ) బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2014 నుంచి 18 వరకు కవిటి ఎంపిఇఒగా పనిచేసిన అనుభవం ఉన్న కళ్యాణ్ కవిటి మండలం వాసులకు సుపరిచితుడే. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయునికి నోటీసు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ లావేటి వరుణ్‌గాంధీ విధులకు గైర్హాజరుపై డిఇఒ ఎస్.తిరుమల చైతన్య సంజాయిషీ నోటీసు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం నోటీసును ఆయన విడుదల చేశారు. 2021 ఆగస్టు 7 నుంచి వరుణ్‌గాంధీ అనుమతిలేని సెలవుపై ఉన్నారని, ఆయనకు గతంలో నోటీసు ఇచ్చినా ఇంతవరకు విధులకు హాజరు కాలేదని పేర్కొన్నారు. ఆయనను శాశ్వతంగా విధుల నుంచి క్రమశిక్షణా నియమావళి 1991 మేరకు తొలగించడానికి చివరిగా ఈనెల 19న మరోమారు సంజాయిషీ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. పది రోజుల్లో ఆయన నుంచి సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో గైర్హాజరుకు మూడేళ్ల కాలపరిమితి పూర్తయినందున విధులనుంచి శాశ్వతంగా తొలగించడం జరుగుతుందని తెలిపారు.


అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాకలో భవానీ భక్తుల సన్నిధానంలో శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. కమిటీసభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఐగా అమీర్ బాధ్యతల స్వీకరణ


అమీర్ అలీ

కొత్తూరు: స్థానిక ఎస్ఐగా అమీర్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నందిగాం ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై కొత్తూరు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అహమ్మద్ విశాఖ పట్నం విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు.


సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలిరూరల్
మేజర్ పంచాయతీ గోపినాథపురంలో కిడ్నీ బాధితుడు పతంగి సూర్యారావు, బ్రాహ్మణ వీధిలో కేన్సర్ బాధితుడు షేక్ ఇమామ్, సర్వమంగళ వీధిలో ఆసరా లేని వృద్ధురాలు పూతిక రాజేశ్వరికు నెల రోజులకు సరిపడే 25 కేజీల బియ్యం, 20 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం సెక్రటరీ లాడే కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు యన్.సింహాచలం, ధర్మవరపు పూర్ణాచారి, అద్దాల వీరభద్రాచారి, మున్నాలి తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న ప్రవీణ్

ప్రవీణ్‌కు భారత్ విభూషణ్ పురస్కారం

ఇచ్ఛాపురం: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, రైజ్ సంస్థల అధినేత డా. ప్రవీణ్ పుల్లటకు ప్రతిష్టాత్మక భారత్ విభూషణ్ పురస్కారం దక్కిడంతో ఇచ్ఛాపురంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతానికి చెందిన ప్రవీణ్ పుల్లెట్‌కు అత్యంత అరుదైన గౌరవం దక్కడం అభినందనీయమని ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి పుల్లెట రాజు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ విధాన సభలోని సిఎం సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయెల్ చేతులమీదుగా ప్రవీణ్ పుల్లట పురస్కారం అందుకున్నారు. స్పీకర్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా సైకిల్ స్టాండ్‌ను శుక్రవారం విరాళదాత బలగ ప్రకాష్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ సూచనల మేరకు బలగ ప్రకాష్ సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.రెండున్నర లక్షలు విరాళంగా ప్రకటించారు. దీంతో స్టాండ్ నిర్మాణం జరిగి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, వి.లూక్‌పాల్, విశ్రాంత ప్రిన్సిపాల్ మోదుగువలస దుర్యోధనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ప్రకాష్

మత్తు పదార్థాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మత్తు పదార్థాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె. వెంకటేష్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘంలోని మెట్టక్కివలస మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, మైనర్లు వాహనాలు నడపడం, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పాఠశాల హెచ్ఎం బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


లావేరు : విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు: విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు వినియోగం వంటి వాటికి బానిస కారాదని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లోలుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం నేరమని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : యువత మత్తు పదార్థాల వైపు వెళ్లొద్దని, వాటిని తీసుకోవడం ద్వారా తీవ్ర నష్టం జరుగుతుందని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు అన్నారు. అంబుసోలిలో యువత, గ్రామస్తులతో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంబుసోలి గ్రామ పెద్దలు, యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: మత్తు పదార్థాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జాడపాలెంలో మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.


ట్రేడ్ లైసెన్సులను పరిశీలిస్తున్న సుధీర్ కుమార్

ట్రేడ్ లైసెన్సులు లేకుంటే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వర్తక, వాణిజ్య సముదాయాల్లో వ్యాపారాలు నిర్వహించే వారు ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్ స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని వ్యాపార సముదాయాల్లో ఆయన ట్రేడ్ లైసెన్సులను శుక్రవారం తనిఖీ చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, పాత వాటిని క్రమం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. తనిఖీ సమయంలో ట్రేడ్ లైసెన్సులు లేకుండా దుకాణాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే అపరాధ రుసుముతో పాటు ఇతర చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమల్లో ఉందని, ప్లాస్టిక్ దుకాణాల్లో నిర్దేశించిన వస్తువులు తప్ప నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేసిన దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

ఎస్ఐ రవివర్మకు శుభాకాంక్షలు

కవిటి: కవిటి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవివర్మకు పలువురు ప్రజాప్రతినిధులు, యువజన సంఘం సభ్యులు, స్థానికులు అభినందనలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం రాత్రి ఉషోదయ యువజన సంఘం సభ్యులు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీరు మాట్లాడుతూ మండలంలో నాటుసారా నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మితిమీరిన వేగం, మైనర్ వాహన చోదకులు, కవిటిలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆరింగి మధు, పాండవ చంద్ర శేఖర్, బెందాలం కామరాజు, తెప్పల మోహనరావు, బావన రవి, పొల్లాయి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

దూడలకు వ్యాధి నివారణ టీకాలు

కోటబొమ్మాళి: మండలంలో కురుడు, చీపుర్లపాడు, యలమంచిలి పంచాయతీలో 4 నుంచి 8 మసాల వయసు గల 87 ఆడ దూడలకు ఉచితంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయటం జరిగిందని కురుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు విడతల్లో ఈ టీకాలు వేయబడుతుందని, మొదటి విడతలో 750 డోసులు పూర్తి చేయడం జరిగిందని, ఇప్పుడు రెండవ విడతలో 800 డోసులు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బ్రూసెల్లోసిస్ అనేది పశు సంపాదన నిర్వీర్యం చేసే ప్రమాదకరమైన వ్యాధన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కె.ముకుంధరావు, పశుసంవర్ధక సహాయకులు ఎస్.వెంకటరమణ, ఎన్.శోభ టీకాలు వేశారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

పొందూరు: మేజర్ పంచాయతీ పరిధిలోని పార్వతీ నగర్ కాలనీలో శుక్రవారం రూ.16 లక్షలతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఎంపిటిసి-4 బాదాన హరిక, టిడిపి మండల అధ్యక్షుడు చిగురుపల్లి రామ్మోహన్, ఉపాధ్యక్షుడు బాదాన శేషగిరి, పట్టణ అధ్యక్షుడు శ్రీరంగ నాయకులు, ఎపిఐఐ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఇఒ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

పొందూరు: శ్రీ సత్యసాయి బాబా జన్మదిన సందర్భంగా సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం భవిత కేంద్రంలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లను ఎంఇఒ-2 పట్నాన రాజారావు చేతులమీదుగా పంపిణీ చేశారు. సహిత విద్య ఉపాధ్యాయులు రాధారాణి, ఫిజియోథెరపిస్ట్ రమ్య, ప్రియాంక పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

ఇచ్ఛాపురం: ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చేపడుతున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు సెల్లా దేవరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో బాలుర వసతి గృహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల పోరాటసమితి సభ్యులు బాబూరావు, కేశవరావు, చలపతి, కాశీ, పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని పిఒడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు కుత్తుం హేమక్క, ఐఎఫ్‌టియు నాయకులు పోతనపల్లి మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మర్రిపాడులో నిర్వహించిన శ్రీకాకుళ అమరవీరుల 46వ స్మారక సభలో పాల్గొని మాట్లాడారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం, ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణ కోసం సమరశీల పోరాటాలకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 1969 నవంబర్ 22న శ్రీకాకుళ సాయుధ పోరాట అమర వీరులు తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావులు పోలీసుల బూటకపు ఎదురు కాల్పుల్లో అమరత్వం పొందారని తెలిపారు. శ్రీకాకుళం ఉద్యమ పోరుబాటలో వందలాది మంది యోధులు అమరులై స్మృతి సంకేతాలై నిలిచారన్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, సమ సమాజ నిర్మాణం కోసం భారత విప్లవోద్యమ నిర్మాణంలో అశువులు బాసిన అమరవీరులకు జోహార్లను అర్పించడం మనందరి బాధ్యతన్నారు. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రతిఘటనా పోరాట అమరవీరులను స్మరిస్తూ పాల్గొన్న వారంతా నివాళ్లర్పించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను, నిర్ణయాలను వేగంగా అమలు జరిపేందుకు పూనుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జడ్డే అప్పయ్య, ఐఎఫ్‌టియు నాయకుడు పోతనపల్లి మల్లేశ్వర రావు, పలు ప్రజా సంఘాల కార్యకర్తలు గర్గం కామేశ్వర రావు, ఉమాపతి, అప్పారావు, కొల్లి మల్లేష్, దుబ్బ బారి కయ్య, రాపాక లచ్చిమయ్య, కొల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.


స్మారక సభలో పాల్గొన్న నాయకులు

26న కేంద్ర ప్రభుత్వ విధానాలపై శంఖారావం


ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పలాస

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో శంఖారావం, ధర్నా జయప్రదం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ పెంట దాలయ్య ఆశ్రమం నుంచి ఇందిరా చౌక్ వరకు శంఖారావం జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు, ఎన్ గణపతి, సిహెచ్ వేణుగోపాల్, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు టి.అజయ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు ప్రకారం రైతు గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు చెల్లించకుండా కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొని శ్రామిక శంఖారావం జయప్రదం చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు సి హెచ్ వేణుగోపాల్, కె బాలాజీరావు, టి భాస్కరరావు, యం ధర్మారావు, ఆర్.దిలీప్ కుమార్, కె.కేశవరావు, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

పొందూరు: జిల్లా కేంద్రంలో ఈ నెల 26న జరుగు రాజ్యాంగ దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న కోరారు. శుక్రవారం మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టర్‌ను హెచ్ఎం బల్ల కంటయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యానికి, లౌకిక తత్వానికి ప్రస్తుత పాలకుల నిర్ణయాలతో ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలోని న్యాయ నిపుణులు, న్యాయశాస్త్ర కోవిదులు, న్యాయవాదులు వ్యతిరేకిస్తున్న మూడు క్రూరమైన చట్టాలను ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 26న జరగనున్న ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.


పొందూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస : ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బూర్లె సీతారాం, గురుగుబెల్లి ప్రభాకరరావు, హనుమంతు ప్రసాదరావు, అచ్చెన్నాయుడు, లక్ష్మణరావు, దామోదరరావు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

వైద్య శిబిరానికి స్పందన

పొందూరు: మండలం వి.ఆర్.గూడెంలో ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 119 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే వైద్య శిబిరంలో భాగంగా హెచ్ఐవి పరీక్షలు 54 మందికి చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, సుఖ వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ గీతా ప్రియ, సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధుసూదన రావు, ఫార్మసిస్ట్ సాయి సురేష్, ఎఎన్ఎం పి.వి.ఎస్.పరమేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి సంధ్య, జోనల్ సూపర్‌వైజర్ ఆదినారాయణ, సిఎల్‌డబ్ల్యు ఉషా రాణి, గణేష్, ఆశావర్కర్లు సన్యాసమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం: రోటరీ క్లబ్ న్యూ జనరేషన్ మంత్ సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ క్రీడా పోటీలు


విజేతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం సురంగి క్రీడా మైదానంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కబడ్డీ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి క్రీడా బృందాలు తలపడ్డాయి. ఇందులో దొంకూరు విన్నర్‌గా, ఈదుపురం రన్నర్‌గా నిలిచాయి. దీంతో పాటు వాలీ బాల్ పోటీలో పురుషోత్తంపురం మున్సిపల్ హైస్కూల్ విన్నర్‌గా, ఈదుపురం జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ముగింపు సందర్భంగా బహుమతులు అందించనున్నట్టు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు డి. కృష్ణమూర్తి రెడ్డి, రామకోటి, వి.సురేష్ కుమార్, మధు కుమార్, గోపి చౌదరి పాల్గొన్నారు.